

# సత్యానికి సంకెళ్ళా?

## పజ్జి కనకారావు

అది నాట్ల తరుణం. గ్రామంలో వున్న

కార్మికులు పనిపాట్లలో నిమగ్నమై ఉన్నారు. ఈ రోజుల్లోనే వ్యవసాయ కార్మికులకు కడుపునిండా తిండి దొరుకుతుంది. రైతులు, కూలీలు తమ పొట్టలు నింపుకోవడమే కాక దేశంలో వున్న ప్రజలందరి పొట్టలు నింపుతారు. అలాంటి రైతులు, అందులోను చిన్న రైతులు వ్యవసాయానికి పెట్టుబడుల కోసం దొరికినచోటల్లా అప్పులు చేసి చివరకు భార్యల మెడల్లో పుస్తెలు సైతం అమ్మి, కొదువపెట్టో భూదేవికి పెట్టుబడి పెట్టి చివరకు పంట చేతికి వస్తుందో లేక ఏ తుఫానో వచ్చి నోట కందబోయే కూడు దూరమౌతుందా? అందిన చోటల్లా అప్పుచేసి నేలమీద పోసాం. రెండేళ్ళ క్రితం వర్షాలు లేక పంటలు పాడయ్యాయి. నిరుడేమో తుఫాను మూలంగా పాడయ్యాయి. ఈ ఏడు ఎలా ఉంటుందిరా భగవంతుడా అని కనిపించనివాడిమీద భారం వేసి పొలంపనులు ప్రారంభించారు. రైతులు, కూలీలు ఆనందంగా పనులు చేస్తున్నారు. వారికి ఈ రోజుల్లోనే చేతినిండా కార్మికులందరికి పని దొరుకుతుంది. రెండుపూటలూ కలో గంజో కడుపు నింపుకోవడానికి అవకాశం వుంటుంది. పనులు మంచి ముమ్మరంగా సాగుతున్నాయి. ఒక ప్రక్క దుక్కులు దున్నుతున్నారు కొందరు. మరో ప్రక్క

గట్లువేసేవాళ్లు వేస్తున్నారు. నారుతీసి కట్టలుకట్టి పోగులుపెడుతున్నారు మరి కొందరు. రంగురంగుల బట్టలు కట్టుకున్న పల్లెపడచులు వంగి నాట్లువేస్తూ, వదినమరదళ్లయినవాళ్లు, అత్తాకోడళ్లయినవాళ్లు మధ్య మధ్య వేళాకోళంగా మాట్లాడుకొంటూ వారి వారి వాక్చాతుర్యాన్ని చూపిస్తున్నారు. ఈ దృశ్యాన్ని చూడటానికి కన్నుల పండుగలా వుంటుంది.

వంగి ఊడుస్తున్న అరవై ఏళ్ళ రత్తమ్మ లేచి "ఒవే వూడుపు మంద కొడిగా సాగుతుంది. అయ్యగారొచ్చే యాలయ్యింది. బాబుగారొచ్చే యేలకి యీదర్ని రెండుమళ్లు వూడుపవ్వక పోతే అందర్నీ తిట్లతో కడిగేత్తాడు. గబాగబా కానివ్వండి" అంది పెత్తనాన్ని ఒలకబోస్తూ.

"నువ్వొక పాట పాడత్తా. మే వంద రం అందుకుంటాం" అంది ముసిముసి నవ్వుతూ ఒక వరసయిన కోడలు.

"నాకే పదాలు రావే కోడలా, అదుగో ఆ ఈరమ్మని పాడమనండి" అంది రత్తమ్మ వెటకారంగ.

"అమ్మో నన్ను పాడమనకండి తల్లీ, నేను పాడానంటే ఎక్కడున్న గాడిద లన్నీ వచ్చాయన్నమాటే."

అందరూ గొల్లుమన్నారు.

"ఇదుగో నువ్వొ వద్దూ, నువ్వొ వొద్దు, అదుగో ఆ కాబోయే పెళ్లి కూతురు సీతవి పాడమనండర్రా" అంది ఒకగొంతు. "నిజమేనర్రో! చంకలో గొర్రినుంచుకొని వూరంతా ఎదికి నట్టుంది. ఇదిగో సీతా మంచి ఉసారుగా పదం పాడవే, మేవందరం నీ యనక అందుకుంటాంలే."

"నాను పాణ్ణుబాబు. నాకు సిగ్గేత్తాది" అంది సీత తల పైకెత్తకుండా నే నవ్వుకొంటూ.

"ఇదిగో సీతా! నీ పాటిని ఏ మారాజన్నా విన్నెత్తుకుపోళ్ళే! మేవందరం వున్నాం. నీకొచ్చే భయం లేదు. ఇంత సిగ్గయితే మా అబ్బాయి నిన్ను పెళ్ళి చేసుకోదే పిల్లా." అంది అత్త వరుసయిన పెద్దతలకాయి.

అందరూ సీత పాట పాడాలని పట్టుకున్నారు. సీత గొంతు సవరించుకొని "యిదిగో రత్తమ్మత్తా, కొంతం పిన్నీ, ఈరమ్మొదినా మీరందరూ నా ఎనకాలే పాటందుకోవాలి మరి." అని సీత పాట ప్రారంభించింది.

అందరూ తలలు వంచుకొని నాట్లు వేస్తూనే సీత పాడి విడిచిన చరణం అందుకొంటున్నారు. సీత కమ్మని గొంతెత్తి జానపద శైలిలో రాగుబోతు వాడి మాటలు నమ్మి శ్రీ రాముడు భార్యను అడవికి పంపిన ఘట్టాన్ని శ్రావ్యంగా పాడుతూ వుంటే తన్మయత్వం చెంది సీతను అనుసరిస్తూ వంతపాడుతున్నారు. తతిమా వాళ్లు

ఇలా పాటలో లీనమై చకాచకా ఊడ్చు కొంటూ, ఎండసంగతి మరచిపోయి ఎంతో సంతోషంతో పని చేసుకు పోతున్నారు.

ఈ తన్మయత్వంలో పెద్దరెడ్డిగా రెప్పుడు వచ్చారో ఎవ్వరూ గమనించనే లేదు. పెద్దరెడ్డిగారంటే ఆ వూరికి పెద్ద రైతు. తోటలు, ధాన్యపుమిల్లు, పట్నంలో సినిమాహాలు. చుట్టూ పదూళ్లల్లో రెడ్డి గార్కి పలుకుబడి, పేరూ వుంది. కక్ష పడితే ప్రాణాలు తీస్తాడని అందరికీ భయం. చాలాకాలం క్రితం రెండు హత్యలు చేయించి తన పలుకుబడితో ఆ కేసులు మాపుచేయించాడని, రెడ్డిగారు ఏ పనైనా చేయగలడని, అందువల్ల ఆయనకు ఎవ్వరూ ఎదురునిలిచి మాట్లాడే ధైర్యం ఆ వూళ్ళో ఎవ్వరికీ లేదు. తన పొలానికి పనికి వచ్చే అందమైన ఆడవాళ్లనెందర్నో పాడు చేసాడు. 'ఇదేమిటి?' అని ఏ ఆడదన్నా ఎదురుతిరిగి రెడ్డిగారి కోరిక కాదంటే ఆ వూరిలో ఆ కుటుంబం కాపురం చేయలేదు. ఊళ్ళో పెద్దరైతులకే రెడ్డిగారంటే భయం. యిక కూలీనాలీ చేసేవారి సంగతి వేరే చెప్పాలా?

పెద్దరెడ్డి దూరాన్నుంచి పాటలు పాడుతూ ఊడుస్తున్న కూలీలను, అందులో ముందుపాట పాడుతున్న పద హారేళ్ళ సీతని చూసాడు. సీత కొంచెం వల్లగావుంటుంది. అయినా అందమయిన ముఖం, పెద్దకళ్ళు, ఎత్తయిన బుగ్గలు, నిగనిగలాడే చెక్కిళ్ళు. ఖరీదయిన బట్టలు లేకపోయినా తల నున్నగా దువ్వుకొని నీటుగా వుంది. చలాకీగా అందంగా వున్న సీతని చూడగానే పెద్దరెడ్డిగారు తన ఏభైఅయిదేళ్ల వయస్సును మరచిపోయి ఇరవై ఏళ్ల కుర్రాడిలా ఫీలయ్యాడు.

"ఒరేయ్! రావుడు, కావుడు" పిలిచాడు పెద్దరెడ్డి.

రావుడు, కావుడు ఇద్దరూ రెడ్డిగారి పాలేళ్ళు. ఒక్కమాటలో చెప్పాలంటే ఊళ్ళో వాళ్ళిద్దరూ పేరుపడ్డ రౌడీలు. చాలాకాలంనుంచి రెడ్డిగారు వాళ్ళిద్దర్నీ పాలేళ్లుగా పెట్టుకొని వాళ్లకు కావలిసింది పడేసి, కానిపనులన్నీ చేయిస్తూ ఉంటాడు. రావుడు, కావుడు మంచీ చెడూ తెలియని మూర్ఖులు. పెద్దరెడ్డి చెప్పిన పనులన్నీ తోకలాడించి చెయ్యడమే వారిద్దరికీ తెలిసింది.

ఏదో పనిచేస్తున్న రావుడు, కావుడు పెద్దరెడ్డి దగ్గరకొచ్చి "దొరగారూ పిల్చారా" అన్నారు.

"ఒరేయ్ రావుడు! అ ఊడ్చే మళ్ళో, ముందుపాట పాడుతున్న గుంటెవర్రా?"

"ఆ పిల్లా!.... ఎంకి కూతురు సీత దొరగారు" అన్నాడు రావుడు.

"ఎంకెవర్రా?" చుట్టముట్టిస్తూ అడిగాడు.

"ఎంకిని మరిసిపోయారా దొరగారు" రావుని చూస్తూ అన్నాడు కావుడు.

"అవును ఎంతమందినని గుర్తు పెట్టుకుంటారు దొరగారు" నసుగుతూ అన్నాడు రావుడు.

"ఒరేయ్ గాడిదకొడకల్లారా, నా ప్రాణం తియ్యక ఆ ఎంకెవరో చెప్పండ్రా" విసుక్కున్నాడు పెద్దరెడ్డి.

"ఎంకంటే అయ్యగారూ.... ఎనిమిదేళ్ళ కితం మన చేలో పనికొచ్చింది. దానిమీద తమరు కన్నేశారు. అది ఎంతకీ వొప్పుకొకపోతే...." రావుడు చెప్పుకుపోతున్నాడు.

కావుడు అందుకున్నాడు. "అప్పుడు దాన్ని నేనొక జబ్బా, రావుడొక జబ్బా పట్టుకొని మన పాకలో పడేస్తే...."

రావుడందుకున్నాడు "అప్పుడు తమరొచ్చి దానిమీద పడి...."

"అబ్బా! ఇక చెప్పక్కర్లేదు గానీ నోరు ముయ్యండ్రా యదవల్లారా" కసిరాడు ముసిముసి నవ్వుతూ రెడ్డిగారు.

"ఆ ఎంకి కూతురా యీ సీత. అందుకే అంతందంగా వుంది గుంట" అన్నాడు కసిగా.

"అయితే మరి.. మరి...." నసిగాడు రావుడు తల గోక్కుంటూ. రెడ్డిగారు ఏం చెప్తారా అని అయ్యగారి ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ చేతులుకట్టు కూర్చున్నారు.

రావుణ్ణి, కావుణ్ణి రెడ్డిగారు చూసి "ఒరేయ్ నన్నాసుల్లారా సాయంత్రం ఇళ్ళకందరూ పోయేసమయానికి ఆ సీత గుంటని ఈ పాకలోకి వచ్చేలాచెయ్యండి, ఆ!" అన్నాడు లోలోపల నవ్వుకొంటూ రెడ్డిగారు.

"దొరగారు మాకిదంతా చెప్పాలా? మాకిదేం కొత్తా" అన్నాడు కావుడు తలగుడ్డ చుట్టుకుంటూ.

"పొద్దుగూకేలోగా సీతని తెచ్చి మీ పాదాలదగ్గర పారేత్తాం. పెద్దపెద్దోళ్ళకే దొరగారి మాట కాదంటానికి గుండెల్లాలవు. ఈ కులంతక్కువ సీతోలెఖ్ఖా, జమా" అన్నాడు పంచెచెంగు పైకి దోపుకుంటూ రావుడు.

"ఊ! నేను మన కొబ్బరితోట వరకు వెళ్ళొస్తాను. మీ రిద్దరూ ఇక్కడే వుండి తొందరగా వూడ్చమనండి. ఆదుగో ఆ ప్రక్కమళ్ళో నీళ్ళు పెట్టండి. ఈ తూర్పేపు మడికి గట్లు సరిగాలేవు జాగ్రత్తగా వెయ్యండి. ఒరేయ్! సాయంత్రం సీత సంగతి మర్చిపోకండి ఆ!...." అంటూ కొబ్బరితోటకు దారి తీసాడు పెద్దరెడ్డి.

వూడ్పు వూడ్చేవాళ్ళందరూ రెండు గంటల వరకు వూడ్చి సూర్యుడు నడినెత్తికి రావడంతో అందరూ అన్నాలకు లేచారు. ఆ ఎండలోనే బోదిగట్టుని వరుసగా కూర్చొని అన్నాలు తింటున్నారు. చీకటితో అదరాబాదరాగా వండుకున్న వంటలు రుచీపచీ లేకపోయినా అదే పంచభక్ష్య పరమాన్నం అనుకొని

ఆనందంగా కబుర్లు చెప్పుకొని అన్నాలు తింటున్నారు ఆ ఆడవాళ్ళందరూ.

"అన్నమ్మత్త దూరంగా కూర్చుందే మిటి? అన్నం తెచ్చుకోలేదా?" అంది ఒకావిడ.

తల వంచుకొని అన్నంలో చెయ్యి పెట్టబోతున్న సీత చటుక్కున ఆగి తల పైకెత్తి చూసింది.

అన్నమ్మ దిగాలుగా కూర్చుంది. సీత మనసు కరిగిపోయింది. "నీ మొగుడు [illegible] తాగుమోతెదవ. ఆడి కట్టం నీ కట్టంకూడా తాగేత్తాడు బుద్ధి లేనోడు. ఇలాటోణ్ణి ఆ గంగానమ్మ మర్సిపొద్ది గానూలు. నీలాటి మంచిదానికి వచ్చి తాగుబోతోణ్ణిచ్చినందుకు ఆ బగవంతుణ్ణనాలి, రా.... రా అన్నం మనిద్దరం తిందాం" అంది సీత.

"నువ్వు తినమ్మా నాకాకల్లేదు" అంది కళ్ళనీళ్ళు తుడుచుకొంటూ అన్నమ్మ.

సీత తన అన్నంమూట తీసుకొని అన్నమ్మ దగ్గరకుచేరి "కంట నీరు పెడ్తే ఆకలి పంట తీరుద్దా?" రేపు నేను అన్నం తెచ్చుకోననుకో నీ అన్నం మనిద్దరం తినమూ? రా.... రా" బలవంత పెట్టింది.

"తినకపోతే నా మీద వొట్టే" అంది సీత ఆప్యాయంగా. సీత చూపుతున్న అభిమానానికి ముగ్ధురాలయింది అన్నమ్మ. సీత అన్నంకలిపి అన్నమ్మ చేతిలో పెట్టింది. సీతని తదేకంగా చూస్తూ "నీ యంత మంచి మనసుగల్ది నాకొక కూతురుంటే ఎంత బాగుణ్ణో" అంది ఆనంద భాష్పాలు తుడుచుకొంటూ అన్నమ్మ.

సీత తలవంచుకొని చిన్నగా నవ్వుకుంది.

ఇదంతా చూసి "సీత మనసు యెన్న పూసలాటిది" అంది రత్తమ్మ.

అందరూ సీత మెత్తని మనస్తత్వాన్ని మెచ్చుకొంటున్నారు.

"ఇంకా తిండిదగ్గరే వుంటే పనెప్పుడు? యికలెండి" అని కేకవేశాడు రావుడు.

అందరూ వులిక్కిపడ్డారు రావుడు గద్దింపు విని. "వీడు తిన్నియ్యడేట్రా?" అంది తిన్నముంత [illegible]కొంటూ రత్తమ్మ. "వీడు మరీ యముడు" నెమ్మదిగా అంది మరొకావిడ. "దేవుడిచ్చినా పూజారి బాదెక్కువైంది" గొణుక్కొందొక పడుచు.

"ఏటి చెప్పారు ఏటా గొణుగుడు? పదహారు పచ్చళ్ళతో కలిపితిన్నట్టు గంట సేపేటి? ఇకలేండి యాలదాటిపోయింది. మళ్ళో దిగండెహే" గట్టిగా అరిచాడు రావుడు.

"ఓరినీ జిమ్మడిపోను. యీడి పెళ్ళాం తాడు తెగ" అని తలోతిట్టూ తిట్టుకొంటూ నారుకట్టలు తీసుకొని మళ్ళో వంగారు ఆడవాళ్ళు.

"ఇదిగో సాయంత్రం కూలిడబ్బులికి ఒక మనిసుండి అందరూ ఎల్లిపోండి" అన్నాడు రావుడు.

"ఇంటి దగ్గిర కూడొండుకోవద్దా? ఎవరుంటార్రా" అంది పెద్దది రత్తమ్మ. "ఇంటిదగ్గర కూడొండడానికి అళ్ళమ్మ ఉందిగా. పోనీ యీ సీత నుంచండి" అన్నాడు రావుడు.

"నాకు భయం. నేనుండను బాబూ" అంది సీత భయపడుతూ.

"నీకేం భయంలేదు. తండ్రిలాటోణ్ని నేనున్నాను గదా" అన్నాడు రావుడు. సీత యింకేమీ అనలేకపోయింది.

సాయంత్రం అయింది. పొలంపని చేసేవారందరూ ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. సీతని అందరి కూలిడబ్బులు తీసుకు రమ్మని కోటి అడవాళ్ళందరూ యిళ్ళకు వెళ్ళిపోయారు. సీత ఒంటరిదయింది. జడుస్తూ జడుస్తూ పెద్దరెడ్డిగారి పాక దగ్గరకొచ్చింది. రావుడు, కావుడు పాక బయట ఏదో సర్దుతున్నారు. అయ్యగారితో చెప్పి కూలిడబ్బు లిప్పించమంది.

"మేమిప్పించేదేమిటే పిచ్చిదానా? భయంలేదు. అయ్యగారు పాకలో వున్నారు. మీ వింతమంది వచ్చాం, కూలి డబ్బులిప్పించండి అను. యిచ్చేత్తారు లోపలకెల్లు" అన్నాడు రావుడు నమ్మకంగా.

ధైర్యం తెచ్చుకొని పాకలోకి అడుగు పెట్టింది సీత. పెద్దరెడ్డిగారు చుట్టకాలుస్తూ పడకకుర్చీలో ఠీవిగా కూర్చొని సీతని చూడనట్లుగా మరోవైపు చూస్తున్నారు. "అయ్యగారు కూలిడబ్బుల కొచ్చాను" అంది మెల్లగా సీత. "ఊం.. ఎంత మందొచ్చారే?" సీతని తదేకంగా చూస్తూ అడిగాడు పెద్దరెడ్డి. "ముప్పై మందయ్యగారు." "అలాగా. నీ పేరే మిటే?" నవ్వుతూ అడిగాడు. "నా పేరు సీతండి." "మంచి పేరు పెట్టుకున్నారే మీ అమ్మా బాబు. యిలా దగ్గరకు రా. అలా కంగారు పడతావేటి? తక్కువ కులంలో పుట్టినా ఎంత అందంగా వున్నావే పిల్లా. కూర్చో" అన్నాడు ముసి ముసి నవ్వుతూ పెద్దరెడ్డి. సీతకు భయంవేసింది.

లేవినవ్వు తెచ్చుకొంటూ "చీకటిపడి పోతంది. నే నెల్లిపోతాను. కూలిడబ్బు లివ్వండి బాబుగారు" అంది వినయంగా సీత. పెద్దరెడ్డి ముందుకు వచ్చి "అలా కంగారుపడతావేంటే పిల్లా?" అంటూ సీత జబ్బ పట్టుకున్నాడు. సీత ఉలిక్కిపడింది. "అయ్యగారూ" అంది దీనంగా వెనక్కి తగ్గుతూ. "నీకేం భయంలేదులేవే రా...." అంటూ ముందుకు లాగాడు వెకిలిగా నవ్వుతూ. సీత భయంతో వణికిపోతూ "అయ్యగారు! నే నలాంటిదాన్ని కాదయ్యగారు. పెద్దోరు. నా అయ్యలాటోరు. నన్నొదిలి పెట్టండయ్యగారు. మీకు దండం పెడతాను." అంటూ చేతులెత్తి మ్రొక్కింది దీనంగా

"అనవసరంగా కంగారు పడతావేంటే, నీకొక్కవలసినంత డబ్బిస్తాను. నీకు మంచి చీర కొంటాలే" అంటూ మరో



అడుగు ముందుకొచ్చి సీతని కౌగలించుకోబోయాడు పెద్దరెడ్డి. సీతకు ఆలోచన తట్టింది. తన బలంకొద్దీ పెద్దరెడ్డిని అవతలకు తోసి పాకబయటకు ఒక్క దూకు దూకి గట్టుమీదనుంచి పరుగుతీసింది.

"ఒరేయ్ రావుడు, కావుడు! ఎక్కడ చచ్చార్రా? దాన్ని పట్టుకోండి" అరిచాడు పెద్దరెడ్డి. ఆ అరుపు విని పాక బైట చుట్టలు కాల్చుకొంటూ పిచ్చాపాటి మాట్లాడుకొంటున్న రావుడు, కావుడు చెరోప్రక్క పరుగెత్తి సీతని పట్టుకున్నారు. సీత వదిలిపెట్టమని అనేక విధాలుగా బ్రతిమిలాడింది. రావుడు, కావుడు వినలేదు. సీత తప్పించుకోవడం కోసం పెనుగులాడింది. ప్రయోజనం లేకపోయింది. రావుడు, కావుడు సీతని చెరో జబ్బా పట్టుకొని బరాబరా యీడ్చుకొచ్చి పాకలో పెద్దరెడ్డి దగ్గర పడేసి చెరో ప్రక్క నిలబడ్డారు. రెడ్డి వికటంగా నవ్వాడు. "ఏమే నన్ను కాదని నువ్వు వూళ్ళో బ్రతకాలనే? యిప్పుడెక్కడికి పోతావో చూస్తాను" అంటూ సీతమీదికొస్తున్నాడు.

సీత కళ్ళనీళ్ళు కారుతున్నాయి. చేతులు జోడించి "అయ్యగారు నన్నంటుకోకండి. రెండు రోజుల్నుంచి నే

నింట్లో కెల్లగూడదు. మీ కూతుర్లాంటి దాన్ని. నన్నొదిలి పెట్టండి. నాలాటి దానికోసం ఆశించడం తమర్లాంటి గొప్పోరికి న్యాయం కాదు" అని దీనాతి దీనంగా వేడుకుంది. కాని ఆ కామాంధుని మనసు కరగలేదు. "అనవసర మాటలు కట్టి నా అవసరం తీర్చు, రా" అంటూ చీరకొంగు పట్టుకొని బలంగా లాగాడు. సీత తన శక్తంతా కూడగట్టుకొని తన్ను తాను కాపాడుకోవడానికి ప్రయత్నించింది. కాని ప్రయోజనం లేకపోయింది. పశుబలం ఎక్కువయింది. సీత వొంటిమీది చీర సాంతం లాగిపారేశాడు. నిస్సహాయ స్థితిలో వున్న సీతపైపడి తన పశువాంఛ తీర్చుకున్నాడు దుర్మార్గుడు పెద్దరెడ్డి. పవిత్ర శీలాన్ని పోగొట్టుకున్న సీత కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి.

"నువ్వు మడిసివి కావురా దున్నపోతువి. నా బతుకు నాశనం చేశావు. ఇక నిన్ను బతకనిస్తాన్రా" అంటూ ప్రక్కన వున్న గడ్డపలుగు తీసి పెద్దరెడ్డిమీదకు బలంగా విసిరింది. బాటున రెడ్డి ప్రక్కకు తప్పుకున్నాడు. కసికొద్దీ సీత రెండు చేతుల్తో పెద్దరెడ్డి పీక పట్టుకుంది. "నేను బతికుండగా నిన్నొదిలి పెట్టన్రా. ఎంతమంది నాశనం చేశావురా? నీ సంగతి వూరంతా చాటుతాన్రా. నువ్వు పెద్ద మడిసివిరా? పశువా"

"ఒరేయ్ దున్నపోతుల్లారా? చూస్తారేరా. ఇది ప్రాణాలతో వుంటే నా ప్రాణం తియ్యక మానదురా. వూ.... కానియ్యండి". అరిచాడు పెద్దరెడ్డి. పీక పిసగబోతున్న సీత చేతులు గట్టిగాపట్టుకొని, ప్రక్కన పడివున్న గడ్డపలుగు అందుకొని సీత తలమీద గట్టిగా కొట్టాడు కావుడు. 'అమ్మా' అని కూలబడిపోయింది సీత. చేతికర్రతో మరో రెండు దెబ్బలేశాడు రావుడు.

"యింకా ప్రాణం వుందిరా ఊఁ...." అన్నాడు మానవత్వంలేని పెద్దరెడ్డి. నేల మీద పడివున్న సీత పీకమీద అడ్డంగా గడ్డపలుగు వేసి రావుడు, కావుడు గట్టిగా తొక్కారు దుర్మార్గులు. సీత కాళ్ళూ చేతులూ గిజగిజా తన్నుకొంటూ ప్రాణాలు విడిచింది. సీత ముక్కుదగ్గర చెయ్యిపెట్టాడు. తల అటుఇటు కదిలించాడు. "ఊఁ.... చచ్చింది. ఒరేయ్ మీరిద్దరూ దీన్ని తీసుకెళ్ళి..." అని రావుడు కావుడికి మెల్లగా ఏదో చెప్పి వారికి కొంత డబ్బిచ్చి "ఊ. తొందరగా నేను చెప్పినట్లు చెయ్యండి" అని వాళ్ళకి పని పురమాయించి పెద్దరెడ్డి మామూలుగా ఇంటికి వెళ్ళిపోయాడు.

బాగా చీకటిపడ్డా సీత ఇంటికి రాకపోయేసరికి సీత తల్లిదండ్రులు కంగారుపడి సాటి కూలీల నడిగారు. కూలి డబ్బులు తీసుకురావడానికి సీత వెనక్కి వుందని చెప్పారు. ఇంతలో వర్షం ప్రారంభమయింది. "వర్షానికి ఎక్కడయినా ఆగివుంటుంది. వర్షం తగ్గాక వస్తాదిలే" అనుకున్నారు సీత తల్లీతండ్రీ. కాని సీత రాలేదు.

తెల్లవారింది. మామూలుగా ఎవరి పనుల్లోకి వారు వెళుతున్నారు. సత్తిగాడు కంగారుగా వచ్చి "దొరగారు! ఎంకి కూతురు ఆ సీత లేదు.... అది మన పొలానికెల్లే దారిలో చచ్చిపడుంది బాబుగారు" అన్నాడు పెద్దరెడ్డితో. సత్తిగాడు చాలా అమాయకుడు. చిన్నప్పుడే తల్లీ తండ్రీ కలరా తగిలి చనిపోయారు. అప్పట్నుంచి సత్తిగాడు వాడికీ వీడికీ వూడిగంచేసి వారు దయతో పెట్టిన అన్నంతింటూ కాలం గడుపుతున్నాడు. అబద్ధం ఆడటం చేతగాదు. వట్టి అమాయకుడు. "నువ్వు కళ్ళతో చూశావా? ఎవరన్నా చెప్పుకుంటే విన్నావా? తెలివి తక్కువ వెధవ" నవ్వుతూ వెటకారించాడు పెద్దరెడ్డి. "నాను సొయంగా చూసా దొరగారు. మీపాదాల సాచ్చి" అన్నాడు, రెడ్డిగారి పాదాలు పట్టుకోబోతూ అమాయకంగా సత్తిగాడు.

రెడ్డి కొంచెం ఆలోచించాడు. పోలీస్ స్టేషన్‌కి కబురుచేశాడు. యస్. ఐ. మరి కొంతసేపటికి కానిస్టేబుళ్ళు వచ్చారు.

పోలీసువారితో కలిసి పెద్దరెడ్డి సీత శవం వున్నచోటికి వెళ్ళాడు. సీత తల్లీ తండ్రి శవందగ్గర కూలబడి ఏడుస్తున్నారు. పోలీసుల్ని చూడగానే గుమిగూడిన జనం ఎటువారటు తప్పుకున్నారు. పెద్దరెడ్డి సీత శవాన్ని చూసి "అరెరె.... ఈ అమ్మాయి నిన్న మా చేలో వూడ్పుకొచ్చింది. సాయంత్రం అందరి కూలి డబ్బులు యీ అమ్మాయికే యిచ్చి పంపాను. చిల్లరా, నోట్లు కలిపి తొంభై ఐదు రూపాయలు యిచ్చాను. ఆ డబ్బు కొట్టెయ్యడంకోసం ఎవరో యింత పని చేశారు. చూశారా కలికాలం" అన్నాడు పెద్దరెడ్డి పెద్దమనిషిలా.

పోలీసువారు శవాన్ని జాగ్రత్తగా పరిశీలించారు. శవం చేతిలో పదిరూపాయల నోటు సగం చిరిగిన ముక్క వుంది. కొన్ని చిల్లర డబ్బులు క్రిందపడి వున్నాయి "ఆఁ.... నేను అనుకున్నదే జరిగింది యస్. ఐ గారు" అన్నాడు పెద్దరెడ్డి యస్.ఐ.వంక చూస్తూ. యస్.ఐ. తల పంకించాడు. "శవం చేతిలో నోటు చిరిగివుండటం, శవందగ్గరే చిల్లర డబ్బులు పడివుండటం చూస్తూ వుంటే కేవలం యీ అమ్మాయి దగ్గరున్న డబ్బు కోసమే హత్యచేసినట్లు కనిపిస్తుంది రెడ్డిగారు" అన్నాడు యస్. ఐ పెద్దరెడ్డి వంక చూస్తూ. "నా అనుమానం కూడా అదే యస్. ఐ. గారు! పూటకిలేని వెధవెవడో యీ దారుణానికి ఒడిగట్టుంటాడు. ఏమంటారు?" అన్నాడు పెద్దరెడ్డి యస్ ఐ వైపు చూస్తూ. "అదే జరిగి ఉంటుంది లేకపోతే ముష్టి కూలిడబ్బుల కోసం గొప్పవాళ్ళు హత్యలు చేస్తారా?" అన్నాడు శవాన్ని చూస్తూ యస్. ఐ.

యస్. ఐ. పి ప్రక్కకు పిలిచి "శవ పంచాయితీకోసం శవాన్ని పట్నం తీసుకెళ్ళాలి కదా! దారి ఖర్చుకోసం యీ డబ్బు మీ దగ్గరుంచండి" అని నోట్ల కట్ట చేతిలో పెట్టాడు నవ్వుతూ పెద్దరెడ్డి. "అబ్బెబ్బే యింత డబ్బా" మొహమాట పడ్డాడు యస్ ఐ. "పరవాలేదు మా వూరికి పెద్దని. పైగా పంచాయితీ ప్రెసిడెంట్ని. యిలాంటి ఖర్చులు నాలాంటి పెద్దమనిషికి తప్పవు లెండి. ఖర్చులకోసం వుంచండి" రెడ్డి

స్వయంగా నోట్లకట్టను యస్. ఐ. జేబులో పెట్టాడు. యస్.ఐ. అటూ, ఇటూ చూసి జేబు సర్దుకున్నాడు. "మీరు చాలా మంచివారండీ. మీలాంటివారున్నందుకు యీ వూరికీ, ప్రజలకీ ఎంతో గర్వకారణం" అన్నాడు నవ్వుతూ యస్. ఐ. పెద్దరెడ్డి కూడా నవ్వు కలుపుతూ "ఏదో లెండి. నేను బ్రతికున్నన్నాళ్ళు యీ వూరిని, ప్రజల్నీ కంటికిరెప్పలాగ కాపాడటం నా విధి. నేను హరీ అంటే ఆ తరువాత యీ వూరిగతి ఏమౌతుందో అనే నా బెంగ" అంటూ పెదవి విరిచాడు, ఈ వూరిని తనే కాపాడుతున్న దేవతలా పెద్దరెడ్డి. "మీలాంటి పెద్దలు లేకపోతే వూర్లో అల్లర్లు, అరాచకాలు పెరిగిపోతాయ్. అసలు వూరే పాడయిపోతుంది" రెడ్డిగారి పెద్దరికాన్ని పొగుడుతూ అన్నాడు యస్. ఐ. "నిజం చెప్పారు. నే నీవూరి ప్రజల్ని కన్నబిడ్డల్లా చూస్తున్నాననుకోండి. ఎవరికే కష్టంవచ్చినా నేను భరించలేను" అన్నాడు విచారాన్ని నటిస్తూ రెడ్డి.

"ఈ హత్యగురించి మొట్టమొదట సత్తిగాడు వచ్చి నాకు చెప్పాడు. అడుదిక్కూ మొక్కూ లేనోడు పైగా రూపాయికోసం ఏపనైనా చెయ్యటానికైనా వెనకాడడు. ఈ అమ్మాయి చేతిలో డబ్బుచూసి చీకటిపడింది కనుక ఎవ్వరూ చూడరులే' అనుకొని యీ అమ్మాయిని చంపేసి ఆ డబ్బు లాక్కుపోయి, ఎవ్వరూ తనను అనుమానించకుండా వుండేందుకు వాడే వుదయంవచ్చి ఫలానా అమ్మాయిని ఎవరో చంపిపడేసారు అని చెప్పాడు వాడిపైన నా అనుమానం. నేను ఈ వూరికి తండ్రిలాంటివాడిని. నా నోటితో నేను బయటికి అనకూడదు. మీరు కూడా ఆలోచించండి" సత్తిగాడి మీద అనుమానం రేకెత్తించాడు పెద్దరెడ్డి.

"ఊఁ అవునండోయ్! సత్తిగాడంటే ఎవడ్రా" గర్జించాడు యస్. ఐ. "నేనే నండయ్యాగారు" జనంలోంచి వచ్చి చేతులుకట్టుకొని నిలబడ్డాడు సత్తిగాడు. సత్తిగాణ్ణి యస్. ఐ గారు ఏమడుగుతారా అని జనమంతా అటే చూస్తున్నారు "ఏయ్ కాంటీస్టైన్, పాట్లీఫోర్! యీ సత్తిగాడికి సంకెళ్ళేయండి." కోపంగా అరిచాడు యస్.ఐ. సత్తిగాడికి మతిపోయినంత పనయింది. నోటిమాట లేదు. సత్తిగాడే హత్య చేశాడంటే అక్కడ మూగినవారెవ్వరూ నమ్మలేదు.

జనంలో గుసగుసలు బయలుదేరాయి. "నిప్పులేకుండా పొగ వస్తుందా? యస్. ఐ. గారు తెలివిగలవారు గనక హత్యచేసినోడ్ని టక్కున పట్టేశారు." నవ్వుతూ అన్నాడు పెద్దరెడ్డి. యస్. ఐ. గర్వంగా నవ్వాడు. సత్తిగాడు తనకేమీ తెలియదని ఏదేదో చెప్పుకున్నాడు. కానీ, వాడి మాటలు ఎవరు పట్టించుకుంటారు? యస్. ఐ. కానిస్టేబుల్ వంక చూసి "వూ..." అన్నాడు కోపంగా. కానిస్టేబుల్సు వులిక్కిపడి సత్తిగాడి చేతికి సంకెళ్ళువేశారు.

పెద్దరెడ్డి రావుడు, కావుడు వంకచూసి చిరునవ్వు నవ్వాడు. అక్కడ చేరిన జనం ఒకటే గుసగుస 'అమాయకుడు, సత్తిగాడికి సంకెళ్ళా!'

—•—